


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం 11 జూన్ 2025 పేజీలు 04


### అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు

## చర్యలు తీసుకోండి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు



సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, అటవీ, విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల గిరిజన, అటవీ ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన కోసం శాఖలు అటవీశాఖకు ప్రపోజల్స్ పంపించాలని సూచించారు. అభివృద్ధి పనులకు అటవీశాఖ నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు పరివేష్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని అధికారులకు స్పష్టంగా తెలిపారు. చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మార్గదర్శకాలను ఇతర శాఖలకు అటవీశాఖ వేగంగా పంపించాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి నాగిని భాను, ఆర్డీఓ రత్నాకళ్యాణి, సంబంధిత శాఖల ఇంజినీరింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**
భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం వేంపల్లి వార్డు కార్యాలయంలో మండల తహశిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్పాండే, పెద్దంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో



ఉప తహశిల్దార్ అతీష్కుమార్ లతో కలిసి రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ( మిగితా...2లో )

### జిల్లాలో సాగునీటి,

## త్రాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

### - కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్

2 లో



### జిల్లాలో రౌడీయిజం

## లేకుండా చేస్తాం

### - రౌడీ అని పేరు చెప్పుకొని దందా చేసే వారిపై పోలీసుల ఉక్కుపాదం- రౌడీ కైంచీ సలీంతో పాటు, ఇద్దరి అరెస్ట్

### - వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

2లో



## పంట సాగులో రైతులకు చేయూత అందిస్తాం

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లాలో పంట సాగులో రైతులకు అవసరమైన సాగునీరు, పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇతర అన్ని విధాలుగా చేయూత అందిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్సాగర్రావు, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతిలతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు, రైతులతో వానాకాలం వ్యవసాయ సాగు సంసిద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలంలో పంట సాగులో రైతులకు అవసరమైన మెళకువలు అందించడంతో పాటు సాగునీరు, పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు ఇతర అన్ని సదుపాయాలు సమకూర్చి చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. పౌల్ట్రీ, డైరీ ఫారాలు, చేపల పెంపకం, పట్టు పరిశ్రమ, పెరటి కోళ్ళ



పెంపకం ఇతర అంశాలపై అర్హులైన పాడి రైతులకు ప్రభుత్వ పథకాల క్రింద అవకాశం ఉన్న రాయితీ రుణాలు అందించి ప్రోత్సహిస్తామని తెలిపారు. పంట రుణాలు, వ్యవసాయ రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందించి రైతులను అభివృద్ధి దిశగా ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో యూరియా, ప్రభుత్వంచే గుర్తించబడిన ఎరువులు, వరి, పత్తి విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లను సమకూర్చడం జరిగిందని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కొరకు జిల్లాలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం



కలుగకుండా మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ రైతులు మొదటి పంటలో దొడ్డు రకం, సన్న రకం వరి ధాన్యాన్ని సాగు చేసుకోవచ్చని, రెండవ పంట సమయంలో పంట మార్పిడి విధానాన్ని అవలంభించి వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి రావడంతో పాటు భూసారం పెంపొందుతుందని తెలిపారు. నిషేధిత / నకిలీ క్రిమి సంహారక మందులు వినియోగించకూడదని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు అవకాశం ఉన్న ప్రతి అంశంలో రాయితీ రుణాలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆ దిశగా బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. గోదాము, పశు వైద్యశాల



ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం సన్నరకం వడ్లు సాగు చేసి ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ-లక్షెట్టిపేట చైర్మన్ ప్రేమ్చంద్, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ప్రతినిధి సింగతి మురళి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో (పైలెట్ మండలం అయిన భీమారం మినహా) కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం దొనబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ నెల 12వ తేదీన 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠశాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని, తరగతి గదులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు,




ఏకరూప దుస్తులు పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించడం జరిగిందని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట, మధ్యలో బడి మానివేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలని, బడి వయస్సు గల ప్రతి ఒక్కరు పాఠశాలలో ఉండే విధంగా ఉపాధ్యాయులు తమ పరిధిలో తగు చర్యలు తీసుకునేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల హాజరు శాతంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించేలా అందరు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర మంత్రి హామీతో దీక్ష విరమణ

## -జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ముందు వివిధ సమస్యల పరిష్కారం పై తలపెట్టిన రిలే నిరాహార దీక్షను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభవృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హామీతో విరమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. వివిధ సమస్యలపై రాజ్ గోండ్ సేవా సమితి, గోండ్వానా పంచాయతీ రాజ్ సెంటర్ జిల్లా మేడిలు చేపట్టిన రిలే నిరాహార దీక్షను జాతీయ నాయకులు సిడాం అర్జు, దీక్ష దారులను జిల్లా కలెక్టర్ ఛాంబర్ కు పిలిపించి రాష్ట్ర మంత్రి తో ఫోనులో మాట్లాడించి నిరాహార దీక్షను విరమింప చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. టైగర్ జోన్ రద్దు కోసం తీర్మానం చేశామని, రోడ్లు, అటవీ భూముల సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల భవనాల నిర్మాణానికి అటవీ శాఖ త మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మంత్రి హామీ మేరకు దీక్ష విరమించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దీక్షదారులకు నిమ్మరసం అందించి దీక్ష విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ., రెవెన్యూ డివిజన్ అధికారి, రాజ్ గోండ్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మడావి నర్సింగ్ రావు, సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంతరావు, ఆడ తాను తిర్యాణి సార్ మేడి, టేకం గంగారం, కోర్కెట నానేశ్వర్, సిడం సూరు మాస్టారు, మహిళా ఆదర్శ సంఘం అధ్యక్షులు దాసరి విజయ, బావునే బాపురావు తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో సాగునీటి, త్రాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

## - కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్

**ఆసిఫాబాద్ ప్రతినిధి,జూన్ 10, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని సాగునీటి, త్రాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ రెడ్డి భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి నీటిపారుదల, మిషన్ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సాగునీటి వనరుల రక్షణ, నీటి వినియోగం, త్రాగునీటి వనరుల ద్వారా ఇంటింటికీ నీరు అందించడం, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు శుద్ధమైన జలాన్ని సరఫరా చేయడం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వనరులు, గ్యాస్ సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న తాగునీటి వనరుల ద్వారా సాగు భూములకు నీటిని అందించాలని, చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సాగునీటి వనరుల ద్వారా వ్యవసాయ రంగమే కాకుండా మత్స్య సంపదను పెంపొందించడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికి, అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు శుద్ధమైన జలాన్ని అందించాలని, ప్రతి వర్షపు నీటిబొట్టుని నిల్వ చేయాలని తెలిపారు. జగన్నాథపూర్ ప్రాజెక్టు పెండింగ్ పనులపై నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 భారీ నీటిపారుదల ప్రాజెక్టు, 3 మధ్య తరహా ప్రాజెక్టులు, 574 చెరువులు, కుంటలు, 13 లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా సాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి నీటిబొట్టును రక్షించేందుకు పర్కులేషన్ ట్యాంకులు, ఫారం పాండ్లు ఏర్పాటు చేస్తున్నామని, మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి గ్రామానికి, ఇంటింటికి, అంగన్వాడి కేంద్రాలకు, పాఠశాలలకు శుద్ధ జలాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు కేంద్ర బృందం గుండి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఇండ్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు శుద్ధ జలం అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు, నీటిపారుదల శాఖ అధికారులు గుణవంతరావు, ప్రభాకర్, మిషన్ భగీరథ అధికారి సిద్ధిఖి, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రౌడీయిజం లేకుండా చేస్తాం

## -రౌడీ అని పేరు చెప్పుకొని దందా చేసే వారిపై పోలీసుల ఉక్కుపాదం- రౌడీ కైంచీ సలీంతో పాటు, ఇద్దరి అరెస్ట్


## - వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్ ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్.**

జిల్లాలో రౌడీయిజాన్ని జిల్లా పోలీసులు ఉక్కు పాదంతో అణచివేస్తారని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. పలు కేసులలో ప్రధాన నిందితుడు, రౌడీ షీటర్, ప్రజల వద్ద డబ్బులను వసూలు చేస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ, కత్తులు చూపిస్తూ బెదిరిస్తున్న, అమాయకులని కొడుతూ రౌడీయిజం చేస్తున్న రౌడీ షేక్ సలీం ఏ కైంచీ సలీంను అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా ఇతను రౌడీయిజం ద్వారా అమాయక ప్రజల వద్ద బెదిరించి, డబ్బులు వసూలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని డీఎస్పీ మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు, ఎక్స్టార్షన్ కేసు, రూరల్ పోలీస్ స్టేషన్లో వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో, సోషల్ మీడియాలో కత్తులతో పోస్టులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే అరెస్టు చేసి రిమాండ్కు పంపడం జరిగిందనీ తెలిపారు. జిల్లాలో రౌడీయిజం చేసే వారిని ఉక్కు పాదంతో అణచివేస్తామనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు కఠినమైన చర్యలు తీసుకుంటూ రౌడీయిజాన్ని జిల్లాలో కనుమరుగు చేస్తామని తెలిపారు. ఇలాంటి వారిపై ప్రజలు నిర్భయంగా ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. జిల్లా పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాయని తెలిపారు. మీరుగా సంప్రదించలేనివారు జిల్లా ఎస్పీని వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చుని, వాట్సాప్ నెంబర్ 8712659973 కి మెసేజ్ ద్వారా సమాచారాన్ని తెలియజేయవచని తెలిపారు.

# జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు..ఎమ్మెల్యే పాయల శంకర్

**ఆదిలాబాద్ ప్రతినిధి జూన్10 మేజర్ న్యూస్:** ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తాను చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రిని మంగళవారం డైరెక్టర్ జైసింగ్ తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రూ: 23 కోట్ల కేంద్రం నిధుల వ్యయంతో ఆస్పత్రిని నిర్మించడం జరిగిందని నిర్మాణ పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేట్ కు దీటుగా ఆసుపత్రిని నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ ఆస్పత్రి అందించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, దానికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో క్రిటికల్ క్లియర్ ఆస్పత్రి ప్రారంభించడానికి కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రులతో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు ఆకుల ప్రవీణ్ కృష్ణ యాదవ్ భరత్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలి

**తలమడుగు 10 సూర్య మేజర్ న్యూస్ :** విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని పరిసరాల పరిశుభ్రతను ఉంచాలని మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రావు సూచించారు. తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల తలమడుగు కాంప్లెక్స్ పరిధిలోగల మధ్యాహ్న భోజన కార్మికులతో మరియు సహాయకులకు పరిశుభ్రత వంట చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పౌష్టిక ఆహారం విద్యార్థులకు అందించాలని ముఖ్య ఉద్దేశంతో ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ తెలిపారు. ప్రొజెక్టర్ ద్వారా వారికి పరిశుభ్రతపై అవగాహన కల్పించి మొదలైన అంశాలపై శిక్షణను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తో పాటు ఉపాధ్యాయులు శంకర్ తదితరులున్నారు.





# కూలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చింతలమానేపల్లి, జూన్ 11, సూర్య :** మెజార్ న్యూస్ మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన లెండుగురే వసంత్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 21.05.2025 నడు మరణించడంతో భార్యతో పాటు ఇద్దరు పిల్లలు అనాథలుగా మారగా రోజు కూలిపని చేసి జీవనం సాగించే వారు ప్రతీ రోజు పనిచేస్తే గాని పూట గడవని పరిస్థితి వారిది. ఉండడానికి గూడులేదు, ఇద్దరు పిల్లలను చదివించడానికి స్తోమత లేదని ఎస్ ఆర్ ఎస్ యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్ పూలే సేవ సమితి అధ్యక్షుడు మోర్లే తిరుపతి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో దాతలు ముందుకు వచ్చి సహకరించారు. దాతల సహకారంతో సేకరించిన విరాళాలను పూలే సేవ సమితి సభ్యులు మృతుని కుటుంబానికి 21361రూ.లు అందించారు. ఈ సందర్భంగా పూలే సేవ సమితి సభ్యులు మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అనేక ప్రాంతాల్లో పూలే సేవ సమితి ఆధ్వర్యంలో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు తమ వంతుగా తోచిన సహాయాన్ని అందిస్తున్నామని, సహకరించిన దాతలకు పూలే సేవ సమితి సభ్యులకు, మాలి సంఘం సభ్యులకు, ఎస్ ఆర్ ఎస్ యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అధికారులు ప్రజాప్రతినిధులు మృతి చెందిన లెండుగురే వసంత్ కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలనుండి అందే పథకాలను తండ్రిని కోల్పోయిన చిన్నారులకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూలే సేవ సమితి జిల్లా అధ్యక్షుడు మోర్లే తిరుపతి, సభ్యులు నికోడే అర్జున్ నికోడే బాపురావు మోర్లే పాండు రంగ్ సెండే ముక్తేశ్వర్, నికోడే హనుమంత్, నికోడే సంతోష్, గుర్లే శ్రీనివాస్, కావుడే సాయి కిరణ్ , మాలి సంఘం గ్రామ అధ్యక్షుడు ధనుంజయ్, గ్రామస్థులు చంద్రు, లక్ష్మణ్, సంతోష్, జనార్ధన్, రాజు, నాగేష్, బరిగల శంకర్, రమేష్, శ్రీనివాస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## చదువుతోనే ఆదివాసీలకు అభివృద్ధి సాధ్యం

✶ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ✶ మారుమూల అటవీ ప్రాంతం భగవాన్పూర్‌కి ద్విచక్ర వాహనంపై పయనం ✶ భీంపూర్ మండలం గుబిడి, టెకిడి రాంపూర్, కరంజీ, భగవాన్పూర్ లలో పోలీసు మీకోసం కార్యక్రమాలు

**ఆదిలాబాద్ ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** చదువుతో నే ఆదిలాబాద్ జిల్లా ఆదివాసుల అభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ప్రజలలో మమేకమై ప్రజలకు అత్యంత చేరువై పోలీసు సేవలను అందించడానికి నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.మంగళవారం బీంపూర్ మండలం లోని మారుమూల గ్రామాలైన గుబిడి, టెకిడి రాంపూర్, కరంజీ, భగవాన్పూర్ లను సందర్శించి ప్రజలతో పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అడవిలో అత్యంత మారుమూల గ్రామం భగవాన్ పూర్ కు ద్విచక్ర వాహనం తో చేరుకొని యువతకు కల్పించిన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని గ్రామానికి పేరును, కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో




ఎలాంటి గంజాయిని పండించకూడదని, సేవించకూడదని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా గంజాయిని పండించిన వారిపై కేసులు నమోదు చేస్తూ, ప్రభుత్వ పథకాలు రాకుండా జిల్లా యంత్రాంగానికి సిఫార్సు చేయబడుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని, ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొని ఉద్యోగాలు సాధించి వచ్చిన ప్రదేశంలో ఉద్యోగాల నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా యువత క్రీడారంగంలోనూ అభివృద్ధి చెందాలని నాలుగు గ్రామాలలో వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేసి క్రీడారంగం లో రాణించాలని ఆకాంక్షించారు. చిన్నపిల్లలకు చదువు ప్రాధాన్యతను తెలియజేసి, ప్రతి ఒక్కరూ చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. చదువు వల్ల భవిష్యత్తు మారుతుందని,



ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ,ప్రైవేటు ఉద్యోగాలు సాధించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. మహారాష్ట్ర తో అనుసంధానంతో ఉన్నందున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, ఎలాంటి సమాచారం అయినా తన వద్ద ఉండే ప్రత్యేకంగా నిర్వహించబడుతున్న 8712659973 అనే నెంబర్కు వాట్సప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. షీ టీం నెంబర్ 8712659953 కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ డి సాయినాథ్, బీంపూర్ ఎస్సై పీర్ సింగ్ నాయక్, గ్రామ పెద్దలు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ సబ్ జూనియర్ టోర్నమెంట్

■ క్రీడాకారులను అభినందించిన ఎంపీ ఎమ్మెల్యేలు ■ విజేతగా హైదరాబాద్ జట్టు ■ రెండు మూడు స్థానాల్లో నిజామాబాద్, నల్గొండ

**ఆదిలాబాద్ ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనగా.... క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. టోర్నమెంట్ విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. నిజామాబాద్, నల్గొండ రెండు, మూడవ స్థానాలను




సాధించాయి. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ను విజయవంతంగా పూర్తి చేయడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. తెలంగాణా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, యూనుస్ అక్బని రాష్ట్రపాల్ తో పాటు పలువురు క్రీడాకారులు, కోచ్ లు పాల్గొన్నారు



## రైతుల ప్రీమియం కూడా కట్టలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం

– మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్ ప్రతినిధి సూర్య మేజర్ న్యూస్ :** అన్నదాతల సంక్షేమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని, ఈ క్రమంలో రైతుల ప్రీమియం కూడా రాష్ట్రం ప్రభుత్వం చెల్లించడం లేదని మాజీ మంత్రి, బీ.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ రైతులు అమ్మిన జొన్న పంట నగదును విడుదల చేయడంతో పాటు రైతు భరోసా కింద పెట్టుబడి సహాయం అందించాలన్నారు. రైతు బీమా పథకానికి కనీసం ప్రీమియం చెల్లించే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని దుయ్యబట్టారు. గత నాలుగైదు నెలల్లోనే నలభై మంది రైతులు చనిపోతే వారికి రైతు బీమా అందలేదని, బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వారం రోజుల్లోగా రైతులు పండించిన పంటలకు నగదు జమ అయ్యేదని, ప్రస్తుతం నెలలు గడుస్తున్నా పంటల నగదును విడుదల చేయడం లేదని మండిపడ్డారు.



అటు కేంద్ర ప్రభుత్వం పిఎం. కిసాన్ సమ్మాన్ యోజన కింద ఈ ఏడాది కేవలం అరవై అయిదు వేల మంది రైతులను ఎంపిక చేయగా అందులో 37 వేల మందికి కిసాన్ సమ్మాన్ యోజన రాలేదని అన్నారు. రైతులకు మేలు చేసే పథకాల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమయిందని ఆక్షేపించారు. రైతులకు అందించాల్సిన ఎరువులు మందుల ధరలను గణనీయంగా పెంచేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. ఇకనైనా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో వారికి అండగా నిలుస్తూ తరపున ఉధృత పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇందులో మాజీ మార్కెట్ చైర్మన్ లు యాసం నర్సింగ్ రావు,గంద్రత్ రమేష్, చందాల రాజన్న, బట్టు సతీష్, కుమ్ర రాజు, దయానంద్,జంగిలి ప్రశాంత్ మహేష్, సూర్యకాంత్, కలీం, తదితరులు పాల్గొన్నారు,

## సీసీ కెమెరాలను ప్రారంభించిన జన్నారం ఎస్ఐ

**జన్నారం, జూన్ 10, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలం పొనకల్ పంచాయతీ పరిధిలో గల శ్రీరాంనగర్ కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా జన్నారం ఎస్ఐ అనూష మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది మనుషులతో సమానమని, ఈ కాలనీలో స్వచ్ఛందంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆడపడుచులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ వద్దకు వచ్చి సమస్యను చెప్పుకోవాలన్నారు. సాధ్యమైనంతవరకు త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై గొల్లపల్లి అనూష ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి సేవలపై నమ్మకం కలిపించలేక పోతున్న యాజమాన్యం

## – సిఐటియు బ్రాంచ్ అధ్యక్షులు వెంకట్ స్వామి

**రామకృష్ణాపూర్, జూన్ 09, సూర్య మేజర్ న్యూస్**

రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిని సందర్శించిన సింగరేణి కాంగ్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం దృష్ట్యా డిస్పెన్సరీ ఏరియా ఆసుపత్రులను నిర్మించిన యాజమాన్యం సరైన డాక్టర్లను నియమించకపోవడం మందులను సరిగ్గా అందుబాటులో ఉంచకపోవడంతో కార్మికులకు సింగరేణి ఆసుపత్రులపట్ల నమ్మకం కోల్పోతున్నదని విమర్శించారు. ఒకవైపు యాజమాన్యం రిఫరల్ వ్యవస్థను తగ్గించాలని కార్మికులకు న్యాయం నాణ్యమైన వైద్య సేవలు అందించాలని చెబుతున్నప్పటికీ ఆచరణలో అవి అందుబాటులోకి రావడంలేదని ముఖ్యంగా ఏరియా ఆసుపత్రులలో గర్భిణీ స్త్రీల కొరకు స్కానింగ్ మిషన్లు కానీ, నవజాత పిల్లల కొరకు ఇంక్యుబేటర్లు గాని అందుబాటులో లేకపోవడం మూలంగా పక్కనున్న పట్టణాలకు పంపించడం వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు.




అంతేకాకుండా యాక్సిడెంట్ రిపోర్ట్ తో హాస్పటల్ అడ్మిట్ అయిన తర్వాత ఫిట్ ఇచ్చేంతవరకు ఆసుపత్రిలో ఉంచుకోవడం వల్ల మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, చివరకు యాజమాన్యం ఏర్పాటుచేసిన సిటి స్కానింగ్ మిషన్ పని చేయకపోయినా పట్టించుకోవడంలేదని, రక్త పరీక్షలను నిర్వహించే పరికరాలు,టెక్నీషియన్ల సంఖ్యను పెంచాలని అన్నారు. మరోవైపు గెలిచిన సంఘం ఏరియాలో జరిగే స్ట్రక్చరల్ సమావేశాల్లో కార్మిక సమస్యలను పై యాజమాన్యంను ప్రశ్నించకపోవడం వలన కార్మిక సంక్షేమం కుంటుపడుతున్నదని, స్ట్రక్చరల్ సమావేశాలలో మాట్లాడుతున్నామని చెబుతున్న నాయకులు సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదో కార్మికులకు చెప్పాలని, ఓడిన సంఘాల వలె వినతి పత్రాలు ఇవ్వడం మానుకొని గత స్ట్రక్చర్ సమావేశాలలో పెట్టిన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదని యాజమాన్యాన్ని నిలదీసే తత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. మెడికల్ కార్డుపై ట్రీట్మెంట్ కొరకు కార్పొరేట్ హాస్పిటల్కు వెళ్ళినప్పుడు ట్రీట్మెంట్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులలో పి.ఆర్.ఓ లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకట్ స్వామి, ట్రెజరర్ వడ్లకొండ ఐలయ్య, వైస్ ప్రెసిడెంట్ అలవాల సంజీవ్, ఆర్గనైజర్ లింగాల రమేష్, సివిల్ ఫిట్ సెక్రటరీ రాజ్ కుమార్, కాసిపేట 2 అసిస్టెంట్ పిట్ డి.సురేష్ విజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన కిరణ్ కుమార్ కు ఘనంగా సన్మానం

**శ్రీరాంపూర్, జూన్ 10, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఐఈడి ఎస్ఈ గా పని చేసి బదిలీపై వెళ్లిన కే కిరణ్ కుమార్ ని మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ తన కార్యాలయంలో ఘనంగా



సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ కిరణ్ కుమార్ శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ సి లైసెన్ ఆఫీసర్ గా కూడా పనిచేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి ఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజిఎం ఐఈడి రాజన్న, డీజిఎం లా శిరీష రెడ్డి, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సి హెచ్ పి ఇన్చార్జి చంద్ర లింగం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్ కార్డులు పంపిణీ

**మంచిర్యాల క్రైమ్, సూర్యా మేజర్ న్యూస్:**

బీపీ మండల్ కమిషన్ సిఫారసులు వెంటనే అమలు చేయాలని కోరుతూ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్ కార్డులు పంపిణీ చేశారు స్థానిక



కేంద్రంలోని ప్రధాన పోస్ట్ కార్యాలయంలో పోస్ట్ కార్డులపై తమ డిమాండ్లను తెలియజేస్తూ రాసిన ఉత్తరాలను పోస్ట్ డబ్బాలో వేశారు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు గజెల్లి వెంకటయ్య జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ 1978లో బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం బీపీ మండల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని 1980లో అప్పటి కమిటీ సభ్యులు బీసీ హక్కుల కోసం 40 అంశాలతో కూడిన నివేదిక సమర్పించారని నేటికీ నాలుగు దశబ్దాలు ముగిసిన ఒకటి మినహా మిగతా సిఫారసులు దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా వెంటనే సిపి మండల కమిషన్ సిఫారసులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# పద్మశాలి సంఘం తుది ఓటరు జాబితా విడుదల

## – అడహాక్ కమిటీ సభ్యులు పుట్ట సదానందం



**మందమర్రి, జూన్ 10, సూర్య మేజర్ న్యూస్:**

పద్మశాలి సంఘం ద్వారా సభ్యత్వం పొందిన వారంతా ఈ నెల 15న జరగనున్న మార్కెట్ ఏరియా పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడి ఎన్నికల్లో పాల్గొని తమ అభిమాన అభ్యర్థిని ఎన్నుకోవాలని అడహాక్ కమిటీ సభ్యులు పుట్ట సధానందం కోరారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్కెట్ ప్రాంతంలోని పద్మశాలి కుల సంఘం తరపున అడహాక్ కమిటీ సారథ్యంలో ఈనెల 8వ తారీఖు వరకు సభ్యత్వ నమోదు చేపట్టి, ఎన్నికల్లో పాల్గొనే సభ్యులతో కూడిన ఓటర్ తుది జాబితాను మంగళవారం పట్టణంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో అడహాక్ కమిటీ సభ్యులు విడుదల చేశారు. అనంతరం మార్కెట్ పద్మశాలి సంఘంలో నమోదైన ఓటర్ల చిట్టాను అధ్యక్ష స్థానానికి బరిలో నిలిచిన ముగ్గురు అభ్యర్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పుట్ట సదానందం మాట్లాడుతూ ఈనెల 15న (ఆదివారం) జరగనున్న పద్మశాలి సంఘం ఎన్నికల ప్రక్రియకు సర్వం సిద్ధమైందని తెలిపారు. 13వ తారీఖు సాయంత్రం 5 గంటల వరకు పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం పూర్తి చేసుకోవాలని 13 సాయంత్రం 5 గంటల తరువాత ప్రచారం నిర్వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని అభ్యర్థులకు సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కుల బాంధవులు, పోటీలో నిలిచిన అభ్యర్థులు కమిటీ సభ్యులకు సహకరించి ఎన్నికల విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడక్ కమిటీ సభ్యులు ఓ రాజశేఖర్, రమేష్, శ్రీనివాస్ పోటీలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

### డ్యూటీలో ఎల్లప్పుడూ రక్షణ

# పరికరాలు ధరించి విధులు నిర్వహించాలి

## – ఏరియా జిఎం జి దేవేందర్ –సేఫ్టీ జిఎం రాగుకుమార్

**రామకృష్ణాపూర్, జూన్ 10, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సిహెచ్ పిలో డీజీఎం బీర్ఖు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రామ్ (ప్రమాదా రహిత అవగాహన సదస్సు-జూన్ 2025) కి ముఖ్యఅతిథిగా మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏరియా రీజినల్ సేఫ్టీ జీఎం రాగుకుమార్, ఏరియా సేఫ్టీ రవీందర్ ఏజీఎం వెంకటరమణ, ఏఐటీయూసీ యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ ఆలీ,వైస్ ప్రెసిడెంట్ లింగయ్య,పిట్సెక్రటరీ హరిరామకృష్ణ,ఇంజనీర్ జాకీర్హుస్సేన్ తదితరులుపాల్గొన్నారు.జీఎం దేవేందర్ మాట్లాడుతూకార్మికులందరూ ఇంటినుంచి రక్షణతో హెల్మెట్ ధరించి డ్యూటీకి రావాలని,డ్యూటీలో ఎల్లప్పుడూ రక్షణ పరికరాలు ధరించి(పిపిఈ) ఎస్ఓపిలో పొందుపరిచిన విధంగా రక్షణ సూత్రాలను అనుసరించి పని చేయాలని ఆయన కోరారు. ప్రతి పనిలో నిబద్ధత కలిగి ఉండాలన్నారు, ఆరోగ్యం పై దృష్టిపెట్టలన్నారు. ప్రతికార్మికుడు ఆరోగ్య సింగరేణియునిగా ఉండాలన్నారు.కంపెనీ సేఫ్టీ కోసం అన్ని సమకూర్చుతుందన్నారు అలాగే కంపెనీ అభివృద్ధిలో అందరూ తప్పకుండా పాలుపంచుకోవాలని ఆయన కోరారు.



# పోడు రైతుల బతుకులను ఛిద్రం చేయకండి: బి ఆర్ ఎస్

**కాగజ్నగర్, జూన్ 10, సూర్య మేజర్ న్యూస్:**

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ యొక్క ఆదేశాలమేరకు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆటవిశాఖ అధికారి నీరజ్ కుమార్ టేబ్రివాల్ ను కలిసిన సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు. ఈరోజు మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా లోని ఆటవీశాఖ అధికారి నిరాజ్ కుమార్ టే బ్రీవాల్ ని కలిసి సిర్పూర్ టీ, నియోజకవర్గంలోని పోడు భూముల సమస్యలపై చర్చించి రైతుల పక్షాన మాట్లాడి పోడు రైతులను ఇబ్బంది పెట్టకుండా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వారిని వ్యవసాయం చేసుకొని తమ కుటుంబాలను సాదుకునేందుకు దోహదపడాలని జిల్లా అటవీ శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ నాయకులు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ టీ, నియోజకవర్గ కన్వీనర్ లేండుగురే శ్యామ్రావ్ , బీఆర్ఎస్ సిర్పూర్ టీ, మండల అధ్యక్షులు అస్లాం, సిర్పూర్ టీ, మండల యూత్ కన్వీనర్ వర్మ, దహెగాం మండల అధ్యక్షులు షాకీర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ నక్క మనోహర్ మాజీ ఉప సర్పంచ్ అదే రాజు. పోడు రైతులు తదితరులు పాల్గొన్నారు.



### జాతీయ బీసీ విద్యార్థి సంఘం మంచిర్యాల జిల్లా

# అధ్యక్షులుగా పూరేళ్ళ నితీష్

రామకృష్ణాపూర్, జూన్ 09, సూర్య మేజర్ న్యూస్:

జాతీయ బీసీ విద్యార్థి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా మందమర్రి మండలం, రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన పురేళ్ళ నితీష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం సంఘ కార్యాలయంలో నితీష్ కు జాతీయ బీసి సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఊదరి చంద్రమోహన్ గౌడ్ నియామక పత్రం అందజేసి జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పూరేళ్ళ నితీష్ మాట్లాడుతూ.. నాకు ఈ బాధ్యత రావడం చాలా సంతోషంగా ఉందని, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తానని బీసీ విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని, నాపై నమ్మకంతో నాకు ఈ బాధ్యత అప్పజేపిన జాతీయ బీసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, జాతీయ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు విక్రమ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నీలకంఠేశ్వర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పూదరి చంద్రమోహన్ గౌడ్, గౌరవ అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్ కి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.

